అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

ఘనంగా వర్ధంతి వేడుకలు

ఆనందపురం : దేశ స్వాతంత్య్రం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కోరాడ వెంకటరావు మాట్లాడుతూ సాయుధ పోరాటంతో ముందుకు సాగిన అల్లూరి ప్రజల జీవన విధానాలను మెరుగు పరచడానికి అలుపెరగని పోరాటం చేశారని కొని యాడారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో ఎంపీడీవో అడపా లవరాజు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు మజ్జి వెంకటరావు, కోరాడ ముసిలినాయుడు, లెంక రాంబాబు, షిణగం అప్పలరాజు, పడాల రాము, కరుణాకర్, సూపరింటెండ్ నాగేశ్వరరావు పాల్గన్నారు.

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ఆదివారం అల్లూరి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పాండ్రంగిలో నిర్మాణంలో ఉన్న మ్యూజియం పనులు ఆరు నెలల్లోగా పూర్తి చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాండ్రంగి పీఏసీఎస్ అధ్యక్షుడు అముజూరి అప్పారావు, మాజీ సర్పంచ్ పల్లి మహేష్ పాల్గొన్నారు. మాజీ మంత్రి ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు స్థానిక అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మహంతి అప్పలరమణ, పాలూరి కృష్ణారావు పాల్గొన్నారు.


అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు


భీమిలి ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

విప్లవ వీరునికి ఘన నివాళి

మధురవాడ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చంద్రంపాలెం బాపూజీ కళా మందిరం వద్ద గల జాతీయ నాయకుల విగ్రహాల్లోని అల్లూరి విగ్రహానికి చంద్రంపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలో ఆయన సాహసాన్ని, త్యాగనిరతిని కొనియాడారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిళ్లా సూరిబాబు, పోతిన పైడిరాజు, పిళ్లా చంద్రశేఖర్, పిళ్లా అప్పన్న, పీస రామారావు, దుర్గాసి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

- అల్లూరి సీతారామరాజు నగర్‌లోని అల్లూరి విగ్రహం వద్ద సీపీఐ, టీడీపీ తదితర పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని స్వతంత్రనగర్ ఏఎస్ఆర్ పార్కులో ఉన్న సీతారామరాజు విగ్రహం వద్ద మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, యూపీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి, పౌర సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు, శెట్టిపల్లి జగన్మోహన్‌రావు, కె.సత్యం, డాక్టర్ రమేష్, తోట.ఆశాస్వరూప్, కాకి.నాగేశ్వరరావు ఉన్నారు.

భీమునిపట్నం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి భీమిలిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీచ్ సమీపంలోని అల్లూరి పార్కులో ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ మూడో వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కదిరి ఎల్లాజీ, ఎర్నింటి అచ్చిబాబు, కోండ్రు రామసూరప్పడు, కొంకుపూడి ఎర్రిబాబు, గేదెల సత్యనారాయణ, పీతల శంకరరావు, పాసి మధు, వాసుపల్లి హరిబాబు, వాసుపల్లి జగదీష్ పాల్గొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

కమ్యూనిస్టు పార్టీలు విలీనం కావాలి

తగరపువలస: కమ్యూనిస్టు పార్టీలను విలీనం చేసి అందులో ప్రజలను భాగస్వామ్యులుగా చేర్చి ఐక్య పోరాటాలు చేసినప్పుడే హక్కులు సాధించగలుగుతామని సీపీఐ సీనియర్ నాయకుడు అల్లు బాబూరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆదివారం గుజ్జు రామునాయుడు భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మనుకొండ సత్యారావు, కానూరి రాంబాబు, తూతిక సోమరాజు, నూలు ఆదినారాయణ, అల్లం గోవిందరావు, సూర్యనారాయణ, చెల్లూరి అప్పారావు, అల్లు చంద్రరావు పాల్గొన్నారు.

పీఎం పాలెం: మన్యం వీరుడు, స్వాతంత్య్ర సమర యోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి శిల్పారామం పరిపాలన అధికారి డి.విశ్వనాథరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు


చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఏఎస్ఆర్ పార్కులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు


ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

మధురవాడ: మధురవాడ అయోధ్యనగర్‌లోని శ్రీ విజయదుర్గ మల్లిఖార్జున స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మూడు రోజులపాటు హోమాలు, కుంకుమ పూజలు చేశారు. ఆఖరి రోజు విజయవాడ ఇంద్రకీలాద్రి ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్రహ్మణ్య ఉమాకాంత్ శర్మ, విజయనగరం జిల్లాకి చెందిన సహస్ర చండీ మహాయజ్వ బ్రహ్మశ్రీ అంపోలు రుద్రకోటేశ్వర శర్మ, ఆలయ అర్చకులు రేజేటి కిరణ్ శర్మ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు బోను వెంకటరావు, అనురాధ దంపతుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ట

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో ఆదివారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. విశేష పూజల అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, ఆలయ ధర్మకర్త పూసర్ల రాముతోపాటు గ్రామస్తులు పూజలు చేశారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

5 వేల మందికి మహాన్నదానం


వడ్డన చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్ 4వ వార్డు మంగమారిపేట గ్రామ దేవత శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి ఓడ ఊరేగింపు మారువారాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలో 5 వేల మందికి మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, మహాలక్ష్మి హేచరీస్ అధినేత ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ సమీపంలో ఇసుక తోటలోని రోసరీ కాన్వెంట్‌కు చెందిన 1999 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.

అందరూ రక్తదానం చేయాలి


రక్తదానం చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం: ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడానికి రక్తం ఎంతో అవసరమని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని భీమిలి సీడీ వెల్ఫేర్ (బీఎన్‌డబ్ల్యూ) అధ్యక్షులు కై పల్లి శ్రీనివాసరావు అన్నారు. కీతిన్‌పేట వద్ద సీడీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 22వ మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ప్రతి సంవత్సరం శిబిరం నిర్వహిస్తున్నామని, తద్వారా అత్యవసర సమయాల్లో తమను సంప్రదించే వారికి రక్తాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 66 మంది రక్తదానం చేశారు. కె.లావణ్య, కాళ్ల సన్నీ, ముసునూరి సూర్య శ్రీనివాస్, అడిదం కిశోర్, రాజేటి బసవ కృష్ణమూర్తి, డాక్టర్ ముమ్మిడిశెట్టి ఆదిత్య, వెంపాడ శ్రీనివాసరెడ్డి, వాండ్రాసి సతీష్ పాల్గొన్నారు.

190 మందికి వైద్య పరీక్షలు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెంలో ఆదివారం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్య సిబ్బంది 190 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జనరల్, కంటి, గైనిక్, ఆర్థో, చిన్న పిల్లల వైద్యులు జి.చంద్రశేఖర్, యశశ్విని, హర్షిణి, దివ్య, మౌనిక తదితరులు పాల్గొని మత్స్యకారులకు ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. దీర్ఘకాలిక సమస్యలు ఎదుర్కొంటున్న 30 మందికి చికిత్స నిమిత్తం సోమవారం ఆస్పత్రికి తరలించనున్నారు. కార్యక్రమంలో పీఆర్వోలు రవ్వ రాము, రమేష్, సతీష్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.


పెదనాగమయ్యపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అనిల్ నీరుకొండ ఆస్పత్రి సిబ్బంది

బీజేపీ బలోపేతంపై దృష్టి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో బీజేపీ బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి ప్రజల్లో ఆదరణ లభిస్తోందని, ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితో అందరికీ ఎంతో మేలు జరుగుతోందన్నారు. వాసుపల్లి శ్రీహరి, కంటుభుక్త సునీత, ఉప్పాడ అప్పారావు, బండారు అనిల్‌కుమార్, మహంతి అప్పలనారాయణ పాల్గొన్నారు.

కూలిన హైస్కూల్ ప్రహరీ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ప్రహరీ కూలిపోయింది. హైస్కూల్ సమీపంలో భవన నిర్మాణం చేపడుతున్న యజమాని ఒకరు ఇటీవల హైస్కూల్ ప్రహరీని ఆనుకుని ఇసుక అన్‌లోడింగ్ చేశారు. ఆ ఇసుక బరువు ప్రహరీపై పడటంతో లోపలివైపు కూలిపోయింది. తరచూ హైస్కూల్ ప్రహరీకి ఆనుకుని చుట్టుపక్కల భవన నిర్మాణదారులు మెటీరియల్ అన్‌లోడింగ్ చేస్తుండటంతో ఆ భారానికి ప్రహరీ కూలిపోవడం... తర్వాత నిర్మించడం జరుగుతోంది. మూడేళ్ల క్రితం నాడు – నేడు పథకం కింద నిర్మించిన ప్రహరీ కూలిపోవడంతో నాణ్యతపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ పనిచేసే సమయంలో ప్రహరీ కూలిపోతే విద్యార్థులకు గాయాలయ్యేవని, ప్రాణనష్టం జరిగేదని వాపోతున్నారు. హైస్కూల్ పరిసరాల్లో భవన నిర్మాణ మెటీరియల్ అన్‌లోడింగ్ చేయకుండా విద్యాశాఖ, జిల్లా పరిషత్ అధికారులతోపాటు స్కూల్ యాజమాన్య కమిటీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కూలిపోయిన చిట్టివలస హైస్కూల్ ప్రహరీ

తుఫాన్ రక్షిత భవనాన్ని కూల్చొద్దని ఆందోళన

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెంలో తుఫాన్ రక్షిత భవనాన్ని కూల్చకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీకి చెందిన మత్స్యకార నాయకులు డిమాండ్ చేశారు. తుఫాన్ రక్షిత భవనం వద్ద వీరు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ రక్షిత భవనానికి మరమ్మతులు చేసేందుకు రూ.18 లక్షలు అవసరమవుతాయని పంచాయతీరాజ్ విభాగం గతంలో ధ్రువీకరించగా, దీనిని రెడ్‌క్రాస్ సంస్థ భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. దీనివల్ల భవనం జీవితకాలం మరో 30 సంవత్సరాలు పెరుగుతుందన్నారు. ఇప్పుడు అదే పంచాయతీరాజ్ విభాగం భవనాన్ని కూల్చివేయాలని ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ఒకవేళ ఈ భవనాన్ని కూల్చితే రూ.50 లక్షలతో కొత్తగా నిర్మించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. లేదంటే ఈ భవనానికి స్థలం ఇచ్చిన గరికిన నరసింహులు కుటుంబ సభ్యులు స్వాధీనం చేసుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. మరమ్మతులు లేదా నూతన భవనం నిర్మించేందుకు స్పష్టమైన హామీ లభించే వరకు పాత భవనం కూల్చివేతను అడ్డుకుంటామన్నారు. పంచాయతీ పాలకవర్గం కోరం లేకుండా ఏడాదికి నాలుగుసార్లు తీర్మానం చేస్తుండటంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. పదేళ్ల క్రితం డీవీస్ లేబొరేటరీ నిర్మించిన పాఠశాల భవనాన్ని కూడా ఏకపక్షంగా కూల్చివేసి రెండేళ్లుగా కేవలం అసంపూర్తిగా ప్రహరీ మాత్రమే నిర్మించారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో దూడ ధనంకొండ, బడే ఎల్లారావు, దూడ పోలయ్య, గరికిన పరశురామ్, సూదుల రంగారావు, గరికిన కొండబాబు, మైలపల్లి దుర్గాప్రసాద్, గరికిన అప్పలస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.


పెదనాగమయ్యపాలెంలో ఆందోళన చేస్తున్న మత్స్యకార నాయకులు

మజ్జిగ పంపిణీ


చంద్రంపాలెం దుర్గాలమ్మ గుడి వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, దాతలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్ద ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. తగరపువలసకు చెందిన బడిగింటి సందీప్ సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ టి.రామలక్ష్మణ్, పద్మశాలీ ఆత్మీయ సేవా సంఘం అధ్యక్షుడు కేవీ నాగేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు మజ్జిగ పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ, బంక వాసు, పోతిన పైడిరాజు పాల్గొన్నారు.

కనులపండువగా నరసింహ జయంతి

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ మందిర నిర్మాణ ప్రదేశంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం నరసింహ జయంతిని కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, సర్వదోష నివారిని నరసింహ యజ్ఞం నిర్వహించారు.

అనంతరం భక్తులు యజ్ఞ కుండీ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా నరసింహస్వామి అవతారం ప్రాముఖ్యతను యదురాజా దాస భక్తులకు వివరించారు. అనంతరం భక్తులు కీర్తనలు ఆలపించారు.


నరసింహ యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ ప్రారంభం

పద్మనాభం: మండలంలోని కోరాడలో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మించిన పైడితల్లమ్మ ఆలయం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశేష పూజల అనంతరం పైడితల్లమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇందులో భాగంగా అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు, కోరాడ సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, భీమునిపట్నం ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, తదితరులు పైడితల్లమ్మను దర్శించుకుని పూజలు చేశారు.


పైడితల్లమ్మ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నాయకులు

మొరాయించిన సెంటర్ లైటింగ్


పీఎం పాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో వెలగని లైట్లు

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి నుంచి పీఎం పాలెం ఆఖరు బస్టాపు వరకూ గల మాస్టర్ ప్లాన్ రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది. విద్యుత్ కాంతులతో ప్రకాశవంతంగా ఉండాల్సిన రోడ్డులో అనేక చోట్ల చీకటి రాజ్యమేలుతోంది. పీఎం పాలెం ఆఖరు బస్టాపు వరకూ 4 బస్టాపులు ఉన్నాయి. రాత్రి సమయంలో నగరం నుంచి వచ్చే స్థానికులు అంధకారం కారణంగా ఇబ్బంది పడుతున్నారు. చైన్ స్నాచర్ల బారిన పడే ప్రమాదం ఉందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉద్యానవన పంటల పరిశీలన

ఆనందపురం : ఆనందపురం, పద్మనాభం మండలాల్లో గల ఉద్యానవనాల పంటలను అధికారులు ఆదివారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యాన వనాల శాఖ కమిషనర్ కార్యాలయం (గుంటూరు) ప్రత్యేకాధికారి పి.వి.రమణ, తదితరులు ఆనందపురం మండలంలోని గిడిజాల, గంభీరం, పద్మనాభం మండలంలోని అనంతవరం, రెడ్డిపల్లి గ్రామాల్లో గల బొప్పాయి, అరటి, మామిడి, కూరగాయలు, పూల తోటలను పరిశీలించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలు రైతులకు వివరించారు. రాబోయే నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తుగా శాస్త్రీయ పద్ధతులు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవనాల శాఖాధికారి కె.మన్మథరావు, ఉద్యాన అధికారి పి.స్వాతి, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.


బొప్పాయి తోట పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రమణ తదితరులు

సిటు ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల ముగింపు

తగరపువలస: భీమిలి డివిజన్ సిటు ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో మే డే వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రజానాట్య మండలి కళాకారులతో గురజాడ అప్పారావు నాటిక, ఉత్తరాంధ్ర జానపద కళాకారుడు బొట్ట తవుడు బృందం జానపద గీతాలు ఆలపించారు. చిప్పాడ పంచాయతీ ఆశిపాలెం సుత్తమ్మతల్లి బృందంచే తప్పెటగుళ్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. టి.నగరపాలెం శ్రీరామ కోలాట బృందంచే ప్రదర్శన, సిటు కళాకారుల డప్పు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, కె.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ కూడలిలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

పూర్ణాహుతితో ముగిసిన హోమాలు

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో కల్యాణ మండపం స్థలంలో శ్రీరామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న హోమాలు ముగిశాయి. ఆదివారం ఆఖరి రోజు విజయవాడ ఓంకార్ పీఠాధిపతులు ప్రమణిస్వామి ఆధ్వర్యంలో శ్రీ సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, ఇతర ధార్మిక కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మహావ్రతయాజుల ధనుంజయరావు, మిథిలాపురి వుడా లే అవుట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రిమూర్తులు రాజు, ఎమ్‌వీ రమణమూర్తి, మహదేవ కోటేశ్వరరావు, సమన్వయకర్త ఎ.శైలజ తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా మలమాను చెట్టు ఉత్సవం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న పైడితల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా సిరిమాను పెట్టడానికి అవసరమయ్యే మలమాను చెట్టు తీసుకొచ్చే మలమాను ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మద్దిలో చెట్టును కొట్టి ఎండ్ల బండిపై పద్మనాభం మీదుగా కృష్ణాపురం తీసుకొచ్చారు. మహిళలు ఈ చెట్టుకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టి పూజలు చేశారు.

క్రికెట్ పోటీల విన్నర్ పెదనాగమయ్యపాలెం

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెంలో గత నెల 18 నుంచి నిర్వహించిన చొప్పా అప్పలనాయుడు మెమోరియల్ క్రికెట్ పోటీల్లో పెదనాగమయ్యపాలెం జట్టు విన్నర్‌గా నిలిచి రూ.30 వేల నగదు బహుమతితోపాటు ట్రోఫీ గెలుచుకుంది. ఆదివారం పంచాయతీలో ఈ క్రికెట్ పోటీలు ముగిశాయి. రన్నర్‌గా చిననాగమయ్యపాలెం జట్టు రూ.15వేల నగదు, ట్రోఫీ గెలుచుకోగా మూడో స్థానంలో భోగాపురం మండలం మద్దిపేటకు చెందిన జట్టు రూ.5వేల నగదు బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అప్పలనాయుడు మాస్టార్ పంచాయతీలో ఉపాధ్యాయునిగా పనిచేసిన కాలంలో ఎందరినో సన్మార్గంలో నడిపించారన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఇరవై రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో 42 జట్లు పాల్గొన్నాయన్నారు. అనంతరం అప్పలనాయుడు కుటుంబ సభ్యులు పంచాయితీలోని 1500 మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తగరపువలస గీతాప్రచార సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.


ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న అప్పలనాయుడు కుటుంబ సభ్యులు